# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంకద్వారా క్రీస్తు సంఘముల కార్యక్రమములు

తెలుగు : సత్యవాణి (The Voice of Truth)
ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం 2-15 గంటలకు.

తమిళం : సత్యవాజి (The Way of Truth)
మంగళవారం - 5-30 p.m.
గురువారం } - 6-45 p.m.
ఆదివారం }

మలయాళం : The Voice of Truth
మంగళ, శుక్రవారాలు 8-45 p m.

కన్నడ : The Voice of Truth
ఆదివారం - 1-45 p m.

హిందీ : సత్యసుసమాచార్
మంగళ, గురు, శుక్రవారాలు 9-00 p.m.
ఆదివారం - 12-45 to 1-00 p m.

ఇంగ్లీషు : The Voice of Truth
సోమవారం - 9-00 p.m.
శుక్రవారం - 7-45 p.m.

ఈ కార్యక్రమాలను అందరు వినండి. అందరికీ విన్పించండి.

Razan Electric Press, Kakinada-1.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 10 మార్చి 1990 సంచిక 8

## సంపాదకీయము

### "మీరు జ్ఞాపకము చేసికొనునట్లు"

### ( By The Way of Rememberance )

అపొస్తలుడైన పేతురు యిట్లు వ్రాసెను: "ప్రియులారా, ఈ రెండవ పత్రిక మీకిప్పుడు వ్రాయుచున్నాను. పరిశుద్ధ ప్రవక్తల చేత పూర్వమందు పలుకబడిన మాటలను, ప్రభువైన రక్షకుడు మీ అపొస్తలుల ద్వారా ఇచ్చిన ఆజ్ఞను మీరు జ్ఞాపకము చేసికొనవలెనను విషయము మీకు జ్ఞాపకముచేసి..." (2 పేతురు 3 : 1, 2). ముందే చెప్పబడిన విషయాలను వారు జ్ఞాపకము చేసికొనుట కుపక్రమించునట్లు వారు ఏ అబద్ధ సిద్ధాంతమువైపు మరలకుండునట్లు ఈ విషయాలు వ్రాయుచున్నానని పేతురు ఈ మాటలు పలుకుచున్నాడు. అనేక అబద్ధ బోధలనుగూర్చి అతడు హెచ్చరించి ఈ విధంగా ముగించెను. "ప్రియులారా, మీరు ఈ సంగతులు ముందుగా తెలిసికొనియున్నారు. గనుక మీరు నీతి విరోధుల తప్పు బోధవలన తొలగింపబడి మీకు కలిగిన స్థిరమనస్సును విడిచి పడిపోకుండ కాచుకొని

యుండుడి. మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి పొందుడి. ఆయనకు ఇప్పుడును యుగాంత దినము వరకును మహిమ కలుగును గాక" (2 పేతురు 3 : 17, 18).

నీవు ప్రాథమిక విషయాలు బోధించుచున్నావా? లేకపోయినట్లయితే కొంత కాలము తరువాత ముఖ్యమైన విషయాలను మరచి పోవుదువు. ఈ సమాచారాన్ని అప్పుడప్పుడు నీవు ఉపయోగించక పోయినయెడల నీవు ఎట్లు ఆ అంశమునుగూర్చి నీ పఠనాన్ని కొనసాగించగలవు? బహుశ నీతో నున్నవారు నీకు ఆ విషయాలను జ్ఞాపకము చేయవచ్చు, లేదా నీవు మరల ఆ విషయాలు తిరిగి చదువవలసిన అవుసరమున్నది. అప్పుడు అవి నీతో కూడ వచ్చును. నీవు వాటిని జ్ఞాపకము చేసికొనని యెడల వాటిని నీవు శాశ్వతంగా దూరం చేసికొంటావు.

దేవుని వాక్యజ్ఞానము విషయములోకూడ అంతే. మనకు సత్యము బోధింపబడినప్పుడు దేవుని చిత్తము నెరిగి విధేయులమై రక్షింపబడుచున్నాము. రక్షింపబడిన తరువాత మనము వెనుకకు వెళ్లి గతంలో నేర్చుకొన్న సామాన్యమైన పాఠాలు తిరిగి చదవనవసరము లేదని కొన్నిసార్లు భావిస్తాము. దేవుని వాక్యాన్ని బోధించేటప్పుడు స్థానిక బోధకుడుగాని, బైబిలు ఉపాధ్యాయుడుగాని ఈ ప్రాథమిక సత్యాలు బోధించుట అనవసరమని కొందరు సభ్యులు భావిస్తారు. ఈ విధమైన భావన సత్యమునుండి వారిని దూరం చేస్తుంది. సత్యానికి అబద్ధ బోధలనుండి రక్షించి నిలబెట్టే సామర్థ్యమున్నది.

జీవితం సామాన్యమైన విషయాల సమ్మేళనం, అవి జీవితానికి ఆధారంగా ఉంటాయి. భౌతికంగా ఆహారం, పాలు మొదలగునవి మనం క్రమంగా తీసుకొంటాం. వీటిని త్రాగడం, ఒక దినంలో కొన్ని

గంటలు నిద్రపోవడం, అవసరమైన వ్యాయామం చేయడం మనం కొనసాగిస్తూనే యున్నాము. వీటిని మనం చేయకపోతే చనిపోతాము. అలాగే మన ఆత్మకూడ ఆత్మీయ విషయాలద్వారా పోషింపబడాలి. దేవుని చిత్తం విషయంలో మెలకువగలిగి యుండునట్లు, అబద్ధ బోధలను ఎదిరించగలుగునట్లు ఈ సత్యాలను మనం మానక జ్ఞాపకము చేసికొనవలసి యున్నది.

దేవుని ప్రజలు గతంలో చెప్పబడిన ప్రాథమిక సత్యాలకు చెందిన ప్రసంగాలు, పాఠాలు సిద్ధము చేసికోవాలి. పాత సభ్యులు ఈ అంశాలను మరల జ్ఞాపకము చెసికొని ఆనందించవలెను. వాటిని బాగా జ్ఞాపక ముంచుకొనినట్లు వారు తలంచాలి. ఆలాగు చేయుట వలన యితరులకు సత్యాన్ని అందజేయడం మాత్రమే గాక ఏ అబద్ధ సిద్ధాంతానికీ నడిపింపబడకుండా నుండుటకు దోహదం చేయగలదు. క్రొత్త సభ్యులు సత్యమునందు స్థిరపడుటకు అవి అవసరం. క్రైస్తవులు కానివారికి సత్యమును నేర్చుకొనుటకు, విధేయతకు ప్రోత్సాహకరముగ అవి అవసరమౌతాయి. చిన్న పిల్లలకు వారి భవిష్యత్తులో బాగా అర్థం చేసుకొని విధేయత చూపుటకు అవి అవసరం కాగలవు.

ఉదాహరణకు : మనం పరలోకమందలి దేవుని గూర్చి, ఆయన సమస్తమును సృజించిన విధానమును గూర్చి, ఆయన ప్రేమనుగూర్చి, ఆయన దయ కృప మనయెడల ఎట్లు విస్తరించి యున్నదో జ్ఞాపకము చేయుట అత్యవసరము (ఆది 1 : 1, యోహా 3:16, ఎఫెసీ 2:8, 9). క్రీస్తు చరిత్రను ఆయన ఏలాగు మానవుల మధ్యకు వచ్చి జీవించెనో, మానవుల పాపముల నిమిత్తము సిలువపై యెట్టి బలియాగము చేసెనో ఆయన పునరుత్థాను డెట్లయ్యెనో, ఎట్లు పరలోకమందలి తండ్రి యొద్దకు ఆరోహణుడయ్యెనో మనం అనేకసార్లు వినవలసిన

అవసరం ఉన్నది. మనము సువార్తను, అపొస్తలుల కార్యములు గ్రంథంలో మార్పుచెందిన క్రియలను, ఒకడు రక్షింపబడుట ఎట్లో లేదా ఒక పాపి విశ్వసించాలని, మారుమనస్సు పొందాలని క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలని ఈ విషయాలు బాగుగా ఎరిగినవారమై యుండవలసిన అవసరమున్నది (రోమా 10:9-17, మార్కు 16:15-16). ఈ ఆజ్ఞలను తెలిపే లేఖన భాగాలు బాగుగా తెలిసికొని వాటి సంఖ్యలు (రిఫరెన్సులు) యివ్వగలిగేటట్లు వాటిని జ్ఞాపకముంచుకొనవలసిన అవసరమున్నది.

సంఘము అనగానేమి? దాన్నిగూర్చి మనకెంత తెలియును? సంఘము కొరకు క్రీస్తు చనిపోయెనని, ఆయన దానిని స్థాపించెనని, అది ఒక్కటే యని, ఒకడు ప్రభువునకు విధేయుడైతే సంఘమునకు చేర్చబడునను విషయం అర్థము చేసుకొనుచున్నామా? (మత్త 16:18, 19; ఎఫెసీ 5:23-25; అపొ.కా. 20:28; ఎఫె 4:1-6; అపొ.కా. 2:47). సంఘము పేరేమిటో మనకు తెలియునా? క్రీస్తును వెంబడించిన ఒకడు ఏ పేరున పిలువబడాలో తెలియునా? (రోమా 16 : 16; అపొ. కా. 11 : 26).

ఆరాధన ఉన్నది. ఆరాధనను గూర్చి మనం ఎంత తెలిసికొనుచున్నాము? దేవుడు కోరునట్టి, ఆయనకు అంగీకార యోగ్యమైనట్టి ఆరాధన యేదో మన స్నేహితులకు తెలియజేయుచున్నామా? (అపొ. కా. 20:7). దేవుని ఆరాధనలో క్రైస్తవులు యాంత్రిక సంగీతాన్ని ఎందుకు ఉపయోగించుటలేదు? (ఎఫె 5:19). ఎందుకు ప్రభురాత్రి భోజనము నాచరించుచున్నాము? (1 కొరింథీ 11).

ఈ అంశాలపై బోధలు మనం వినవవసరం లేదని భావిస్తే ఇవిగో ప్రశ్నలు. ఈ సత్యాలను మనం అర్థం చేసికొని యున్నామా?

వీటిని మన స్నేహితులకు బోధింపగలమా? ఆత్మ సంబంధమైన విష యాలలో మనం నమ్మి ఆచరించే సంగతులకు వాక్యాధారాన్ని యివ్వగలమా? మత సంబంధమైన మిగిలిన వారికంటె మనం ప్రత్యే కంగా ఎందుకున్నాము?

సహోదరులారా, మీచుట్టు ఉన్నవారికి ఈ సత్యాలను బోధించుటయే వీటిని మనస్సులో ఉంచుకొనుటకు ఒక ఉత్తమమైన మార్గము. నీ స్నేహితులను నీవు ఆరాధనకు తీసుకొని వచ్చినట్లయితే, సామాన్యమైన ఈ సత్యాలను నీవుకూడ విని ఆనందించ గలవు. అందుచేత వారిద్వారా నీవు వాటిని వినినప్పుడు క్రొత్త దనము, ఆనందము నీకు కలుగును. సత్యము బోధించినప్పుడు నీవు అనేకసార్లు విన్నను అది నీకు ఇప్పుడు ఆనందము, ఆశ్చర్యము కలుగ జేయును. ఎందుచేతననగా నీ స్నేహితులకు రక్షించే ఈ సత్యాలు అవసరం గనుక.

అవును, ప్రాథమిక సత్యాలకు అతీతంగా మన క్రైస్తవ అభి వృద్ధి కొనసాగాలి, గాని అవి ఆత్మ సంబంధమైన పునాదిగా వేసికొని వాటిని మానక జ్ఞాపకము చేసికొనవలసిన అవసరం ఉన్నది. ఈలాగు చేయుటవలన మనం ఆరంభంలో ఉన్న ఆత్మీయ విషయాల మాదిరిని బట్టి నడువగలము. మనం నమ్మి ఆచరించే సత్యాలద్వారా తిరిగి నమ్మకాన్ని, నిరీక్షణను కలిగి యుందము. మనకు ప్రభువుయొక్క అవసరాన్ని ఇవి జ్ఞాపకం చేస్తాయి. ఈ సామాన్యమైన సత్యాలు మనతోటి మానవులకు బోధించుటయొక్క అవసరాన్ని కూడ జ్ఞాపకం చేస్తాయి. నిజానికి వీటిని మనం విడిచిపెట్ట కూడదు.

# దేనిని ఆశింపకుము

## (Thou shall not Covet)

గత కొద్ది మాసములలో దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయుల కిచ్చిన పది ఆజ్ఞలను ధ్యానిస్తున్నాము. ఈ రోజు పదియవ ఆజ్ఞను గమనిద్దాం. దేవుడిట్లు ఆజ్ఞాపించాడు: "నీ పొరుగువాని ఇల్లు ఆశింపకూడదు. నీపొరుగువాని భార్యనైనను అతని దాసునైనను అతని దాసినైనను అతని యెద్దునైనను అతని గాడిదనైనను నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు" (నిర్గమ 20:17). ఈ పదియవ ఆజ్ఞ అన్నిటికంటె కష్టమైనదని చాల మంది తలస్తారు. అది మానవుని అంతర్యాన్ని గూర్చి అతని తలంపులను అదుపులో యుంచుటను గూర్చి చెప్పబడినది. మిగతా ఆజ్ఞలన్నియు పైకి కనబడే క్రియలనుగూర్చి చెప్పబడితే, ఈ చివరి ఆజ్ఞ మన ఆశలను అదుపులో యుంచడం గూర్చి చెప్పబడినది.

నీ పొరుగువాని యిల్లును, భార్యను, దాసుని, దాసిని, పశువులను, లేక దేనిని ఆశింపకూడదు. ఒక యింటిని, భార్యను, పశువులను దాస దాసీలను కలిగి యుండాలని ఆశించడం తప్పు కాదుగాని, అవి పొరుగువానివైతే వాటిని ఆశించడం తప్పు. ఆశిస్తే "కృపావరములలో శ్రేష్ఠమైన వాటిని ఆసక్తితో అపేక్షించుడి" యని అపో. పౌలు చెప్పాడు (1 కొరింథీ 12:31).

'దురాశ దుఃఖానికి చేటు' అనే లోకోక్తిని మనం ఎరిగి యున్నాము. దురాశను, దురాశపరులను దేవుని వాక్యము ఖండించుచున్నది. ఇందు విషయమై బైబిలులో చెప్పబడిన కొన్ని వాక్య భాగాలను చూద్దాం: "దుర్లాభమును ద్వేషించువాడు దీర్ఘాయుష్మంతుడగును" అని సామె 28:16లో వ్రాయబడి యున్నది. "మీరు ఏ విధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్తపడుడి; ఒకని కలిమి

విస్తరించుట వాని జీవమునకు మూలము కాదని" యేసుప్రభువు బోధించాడు (లూకా 12 : 15). విగ్రహారాధికుడై యున్న లోభి ఎవ డును దేవుని రాజ్యమునకు హక్కుదారుడు కాడని అపొ. పౌలు బోధిం చాడు (ఎఫెసీ 5:5). ధనాపేక్ష లేనివారమై మనకు కలిగిన వాటితో సంతృప్తి జెందాలని హెబ్రీ 13:5లో బోధింపబడినది. మరల భక్తుడైన యోహాను యిట్లు చెప్పుచున్నాడు: "ఈ లోకమునైనను లోక ములో ఉన్న వాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించినయెడల తండ్రిప్రేమ వానిలో నుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోక సంబంధమైనవే. లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి గాని దేవుని చిత్తమును జరిగించు వాడు నిరంతరము నిలుచును" (1 యోహాను 2:15-17).

## దురాశవలన దుఃఖము

తరువాత, పాపాని కంతటికి దురాశయే మూలకారణమని మనము తెలిసికొనాలి. "ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" యని 1 తిమోతి 6:10లో అపొ. పౌలు చెప్పాడు. దురాశవలన దేవుడు నిషేధించిన వృక్ష ఫలాన్ని హవ్వ తినింది. "(స్త్రీ) ఆ వృక్షము ఆహారమునకు మంచిదియు, కన్నులకు అందమైనదియు, వివేకమిచ్చు, రమ్యమైనదియు నై యుండుట చూచినప్పుడు ఆమె దాని ఫలములలో కొన్ని తీసికొని తిని తనతోపాటు తన భర్తకును యిచ్చెను, అతడుకూడ తినెను" (ఆది 3:6). ఈ విధంగా మానవజాతి అంతయు ఆదాము హవ్వల దురాశ వలన పాపములో బడింది.

ఇశ్రాయేలీయులు యెరికో పట్టణమును ముట్టడించి పట్టుకొన్న ప్పుడు వారిలో ఒకడగు ఆకాను శపితమైన వాటిని ఆశించి తీసికొనగా

వారు చేయు యుద్ధములో అపజయము నెదుర్కొనిరి. చివరకు ఆకాను దోషిగా తేలినప్పుడు అతడు "దోపుడు సొమ్ములో ఒక మంచి షినారు పైవస్త్రమును రెండు వందల తులముల వెండిని ఏబది తుల ముల యెత్తుగల ఒక బంగారు కమ్మిని చూచి వాటిని ఆశించి తీసి కొంటిని" అని ఒప్పుకొన్నాడు (యెహోషువ 7 : 21). అతడు చేసిన పాపము వలన రాళ్ళతో చావగొట్టబడ్డాడు. దావీదు మహారాజు ఊరియా భార్యయైన బత్షెబను ఆశించి ఆమెతో వ్యభిచరించాడు, ఆమె భర్తను హత్య చేయించాడు (2 సమూ 11వ అధ్యా). ఎలీషా ప్రవక్త యొక్క సేవకుడగు గేహాజీ నయమాను తీసికొని వచ్చిన బహుమాన ములలో కొన్నింటిని ఆశించి తీసికొనినందున నయమానుకు కలిగిన కుష్టు రోగము అతనికి అతని సంతతికి అంటి యుండునట్లు శపింపబడ్డాడు (2 రాజులు 5 అధ్యా).

దురాశ వలన ఇస్కరియోతు యూదా యేసుప్రభువును అప్ప గించాడు. ప్రభువును వెంబడించుచుండినను అతడు 'దొంగయైయుండి తన దగ్గర డబ్బుసంచి యుండినందున అందులో వేయబడినది దొంగి లించుచు వచ్చెను" అని యోహాను అతని గూర్చి చెప్పుచున్నాడు (యోహాను 12:6). అతడు ముప్పయి వెండి నాణెములకే ప్రభువును అప్పగించేసాడు. చివరకు ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ సంఘటనను గూర్చి మత్తయి ఇట్లు వ్రాసాడు: "అప్పుడాయను అప్పగించిన యూదా ఆయనకు శిక్ష విధింపబడుట చూచి పశ్చాత్తాపపడి ఆ ముప్పది వెండి నాణెములను ప్రధానయాజకుల యొద్దకును పెద్దల యొద్దకును మరల తెచ్చి, నేను నిరపరాధ రక్తమును అప్పగించి పాపము చేసితి నని చెప్పెను.. అతడు ఆ వెండినాణెములు దేవాలయములో పారవేసి పోయి ఉరిపెట్టుకొనెను" (మత్త 27:3-5). మనమెట్లు ఆలోచించినను మానవుని దురాశయే సమస్త కీడులకు మూలమని తప్పక గ్రహించ గలము.

నీ ఆత్మ రక్షణ కంటె నీ శరీరక్షేమాన్ని ఎక్కువ ఆశించుచున్న యెడల నీవు నాశనమునకు పోవు మార్గములో యున్నావు. యేసు ప్రభువు ధనవంతుడైన ఒక రైతును గూర్చి ఇట్లు చెప్పాడు: ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండెను. అప్పుడతడు తన కొట్లు విప్పి పెద్దవిగా కట్టించి, నా ధాన్యమంతటిని నా ఆస్థిని సమకూర్చుకొని నా ప్రాణముతో ప్రాణమా అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడి యున్నది. సుఖించుము తినుము త్రాగుము సంతోషించుమని చెప్పుకొందుననుకొన్నాడు. గాని ఆ రాత్రి దేవుడతని ప్రాణాన్ని తీసికొన్నాడు. దేవునివలన ధనవంతుడు కాక తన కొరకే సమకూర్చుకొనువాడు ఆలాగుననే యుండునని ఆయన చెప్పాడు (లూకా 12:16-21). దేవుడతనిని వెర్రివాడా యని పలికాడు. "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతని కేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా నేమి యియ్యగలడు?" అని యేసుప్రభువు మనలను ప్రశ్నించుచున్నాడు.

## సంతుష్టి కలిగి యుండాలి

పరుల సొమ్మునుగాని, మరి యేదైనాగాని మనం ఆశించకుండా యుండాలి. అపొ.పౌలు ఇట్లు బోధించుచున్నాడు: "సంతుష్టిసహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమై యున్నది. మనమీ లోకములోనికి ఏమియు తేలేదు, దీనిలోనుండి ఏమియు తీసికొనిపోలేము. కాగా అన్న వస్త్రములుగలవారమై యుండి తృప్తిపొంది యుందము. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేకయుక్తములును, హానికరములైన అనేక దురాశలలో పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును" (1 తిమో 6:6-9).

దురాశనుండి విడుదల పొందాలంటే మనము ప్రభువును ప్రేమించాలి. నీ పూర్ణ హృదయము, మనస్సు శరీరముతో ఆయనను

ప్రేమించాలి. క్రీస్తునందు విశ్వాసముంచాలి, పాపములను గూర్చి మారుమనస్సు పొందాలి, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందాలి. క్రీస్తుచే క్రీస్తు సంఘముతో చేర్చబడాలి. పొరుగువానిది ఏదైనను ఆశించుట పాపమని గ్రహించాలి!

—జాషువా గూటం.

---

# క్రీస్తు సంఘము సాటిలేనిది

## (The Church of Christ is Distinctive)

( గత సంచిక తరువాయి )

దాని ప్రాముఖ్యమును బట్టి క్రీస్తు సంఘము సాటిలేనిది. సాంఘిక, రాజకీయ విషయాలతో దీనికెట్టి సంబంధము లేదు. మరో మాటలో చెప్పాలంటే మనము ఆత్మ సంబంధమైన అవసరాలను నొక్కి చెప్పెదము. ప్రభువు రాజ్యము ఈ లోక సంబంధమైన విషయాలతో మిళితమైనది కాదని క్రొత్త నిబంధన స్పష్టము చేయుచున్నది (యోహా 18:36, మత్త 22:21). చాలమంది మతశాఖలవారు మానవునికి అవసరమైన సువార్త సందేశాన్ని అందించడానికి బదులు సభ్యులకు వినోదాన్నందించే కార్యక్రమాలను అందించడం ఈ దినాల్లో చూస్తున్నాము. కొందరు వారు సుందరంగా నిర్మించుకొన్న కట్టడాన్ని క్రైస్తవ విజయంగా తలంచుచున్నారు. కాని హస్తకృతములైన ఆలయములలో దేవుడు నివసింపడని అపొస్తలుల కార్యములు 17వ అధ్యాయము బోధించుచున్నది.

హస్తకృతములైన ఆలయములలో దేవుడు నివసింపడని అపొస్తలుల కార్యములు 17 నందు చదువగలము. సంఘములన్నియు ఆహార విక్రయం మొదలగు వ్యాపారాన్ని విడిచి స్వచ్ఛమైన నూతన నిబంధన క్రైస్తవ్యాన్ని పరికటించిన యెడల అది గమనించదగిన

అభివృద్ధి కాగలదు. సంఘముయొక్క పనికి అవసరమైన ధనాన్ని సమకూర్చుకొనుటకు మన రక్షకునిద్వారా యివ్వబడిన పథకాన్ని అనుసరించవలసి యున్నది. లాటరీలు నిర్వహించడం, ఆహారాన్ని విక్రయించడం మొదలగు విషయాలు అవసరం లేదు. సంఘముయొక్క నిధి నిమిత్తమై దేవుని పథకం 1 కొరింథీ 16:1-2లో మరియు 2 కొరింథీ 9:6-7 లోను చదువగలము.

## ప్రాతిపదిక పునరుద్ధరణ

క్రీస్తు సంఘములు పునరుద్ధరణను కోరుచున్నవి. సంస్కరణను కోరడంలేదు. ఇదే ప్రాథమికమైన వ్యత్యాసము. మార్టిన్ లూథరు ఆ దినాల్లో అబద్ధ బోధలపై ధ్వజమెత్తిన ప్రత్యర్థి. సరయిన మార్గంలో ఆయన సమస్యను ఎదుర్కొనలేదు. రోమన్ కేథలిక్ మతాన్ని సంస్కరించాలని లేదా సరిదిద్దాలని ఆయన కోరిక. విశ్వాస భ్రష్టత్వమును, రోమాను అధిగమించి క్రీ॥శ॥ 33లో ప్రారంభమైన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించాలని మా కోరిక. అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో సంఘముయొక్క గొప్ప ఆరంభాన్ని గూర్చి చదువగలము. ఇది 'కేథలిక్' కాదు. 'ప్రొటెస్టెంట్' అసలే కాదు. క్రైస్తవులు మాత్రమే. ప్రభువు సంఘము ఆదిమ శతాబ్దములో బోధించుటలోను, ఆచరించుటలోను సర్వసత్యమును ఏ విధముగ గౌరవించి యున్నదో అదే విధముగ అసత్యము విషయములో అప్రమత్తముగా నున్నది. ఈనాడు కూడ ప్రపంచములో యింతకంటె మంచి భావన లేదు. మన ఆసక్తి వెస్లీ, కేల్విన్, లూథర్, అలెగ్జాండర్ కాంబెల్ లేదా జోసఫ్ స్మిత్ యెడల కాదుగాని దేవుని కుమారుని సత్యసువార్త నిమిత్తమైనది. యోహాను 8:32లో "సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయు" నని చెప్పబడింది. సుమారు 1900 సంవత్సరాల క్రితము క్రీస్తు, ఆయన అపొస్తలులు బయలుపరచిన విషయాలు అంగీకరించి మతశాఖల బంధకాలను పూర్తిగా తిరస్కరించవలెనని

మేము నొక్కి చెప్పుచున్నాము. "సంస్కరణోద్యమము" నందలి దోషములను విడిచిపెట్టి ఆదిమ సంఘము ఆచరించిన పద్ధతిని ఆచరించుటద్వారా యిది సాధ్యము. మా ఆసక్తియందు వివేకమును మీరు చూడగలరు. ఈ విధానము ఒక మానవుని గాని, ఉద్యమాన్ని గాని గౌరవించదు. అది క్రీస్తును మాత్రమే గౌరవించుచున్నది. క్రీస్తు ఆరోహణము తరువాత శతాబ్దాలను కలుషితం చేసిన అబద్ధ బోధలను విధేయతతో కూడిన కార్యాలతోను మన విమోచకుని క్రొత్త నిబంధన బోధ ననుసరించి నడుచుకొనుట ద్వారాను తుడిచివేయగలము.

అనేక ప్రాంతాలలో క్రీస్తు సంఘమునుగూర్చి ఎరిగియున్న కొందరు బాప్తిస్మమును గూర్చి మేము ఎక్కువగా చెప్పుచున్నట్లు భావించుచున్నారు. కొందరు ఈ విధంగా నాతో చెప్పారు: "నీటి బాప్తిస్మము, సత్వరమే విధేయత అనే విషయాన్ని మీరు ఎక్కువగా బోధించుచున్నారు". సామాన్యంగా వినబడే ఈవిమర్శను పరిశీలిద్దాం. రక్షణ కొరకు బాప్తిస్మము అవసరమని బైబిలు బోధించినట్లయితే ఎక్కువగా దానినిగూర్చి బోధించుటలో దోషము లేదు. మార్కు 16:16లో నమ్మకము, బాప్తిస్మము తరువాత రక్షణ యున్నదని ప్రభువు బోధించెను. అపొ. కా. 22:16లో బాప్తిస్మము పాపములు కడిగివేయునని పౌలుకు బోధింపబడెను. గలతి 3:27లో క్రీస్తును ధరించుకొనుటకు ఆయనలోనికి బాప్తిస్మము పొందుటయే మార్గమని మనము నేర్చుకొనుచున్నాము. పాపక్షమాపణ నిమిత్తము "మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుడి" అని వ్రాయబడెను (అపొ.కా. 2:38). ఈ వాక్యభాగాల వెలుగులో మేము మాటిమాటికి పాపులయొక్క బాధ్యతయేదో గుర్తు చేయుచున్నాము. ఆదిమ శతాబ్దములో సువార్తికులు బాప్తిస్మముయొక్క అవసరతను గూర్చి బోధించుటకు త్వరపడిరను విషయము స్పష్టమైనది. అపొ. కా. 8:26-29లో ఐతియొపీయుడు మార్పు చెందుటను గూర్చి చదువగలము. అతడు క్రీస్తును గూర్చిన

ఒకేఒక ప్రసంగమును వినెను. ప్రసంగము అనంతరము అతడు ప్రభువులో ముంచబడుటను కోరుకొనెను. త్రోవలో బోధకుడైన ఫిలిప్పు ఐతియోపీయుడైన యితనికి బాప్తిస్మ మిచ్చెను. ఆత్మావేశపూరితమైన ఈ వాక్యభాగంలో క్రీస్తు సువార్త బోధింపబడినపుడు బాప్తిస్మము కూడ అందు ప్రస్తావించబడినది. నిజాయితీ కలిగినవారు వెంటనే విధేయత చూపుదురు. అపొ. కా. 16:25-34లో ఫిలిప్పీ పట్టణమందలి రోమా చెరసాలాధిపతిని గూర్చిన వాక్యభాగాలు మనం కనుగొనగలము. అతడు క్రీస్తును గూర్చి ఎరుగనివాడు. పౌలు నోటిద్వారా గొప్ప పాఠాన్ని వినిన వెంటనే అర్ధరాత్రి అతడు బాప్తిస్మము పొందెను. అది బాప్తిస్మము పొందుటకు మంచి సమయము కాదు. సందర్భము కాదు. క్రీస్తుకు విధేయత చూపుట ఎంత త్వరితము జరిగియున్నదో యిక్కడ స్పష్టమగుచున్నది. క్రీస్తు సంఘము నందలి బోధకులు బాప్తిస్మమును గూర్చి ఎక్కువగా ఎందుకు బోధించుదురనే ప్రశ్నకు యిది జవాబు. దేవుడు మానవుని కిచ్చిన అన్ని ఆజ్ఞలకు ప్రాముఖ్యము నివ్వాలి. బాప్తిస్మము అను ఈ అంశాన్ని గూర్చి అనేక దుర్బోధలు చేయబడుచున్నవి. మేము వీటిపై పోరాడుటకు ఎక్కువ సమయం వెచ్చింపవలసిన అవసరం ఉన్నది. మేము ప్రభువు చిత్తం జరిగించునట్లు మనుష్యులను ప్రేరేపించుచున్నాము (2 కొరింథీ 5:11).

చివరిగా క్రీస్తు సంఘము దానియొక్క ప్రయోజనము విషయములో సాటిలేనిది. ఎఫెసీ 3:21లో క్రీస్తు శరీరము యొక్క దైవికమైన ప్రయోజనము మనకు తెలియజేయబడి యున్నది. దాని ఉనికి యొక్క హేతువు దేవుని మహిమపరచుటయే. జగత్తు పునాది వేయబడకమునుపే "సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్న" సంఘమును స్థాపించుట దేవుని సంకల్పము (1 తిమోతి 3 : 15). సంఘము సృష్టికర్తను మహిమపర్చాలంటే అది బైబిలునందు బయలు పరచబడిన దైవికమైన చట్టాన్ని పాటించవలసి యున్నది

(హెబ్రీ 8:5). దాని బోధ, ఆరాధనాక్రమము, నిర్వహణా విధానము "ప్రభువుచెప్పిన" పునాది కలిగి యుండవలెను. మనము ముఖ్యముగా గమనించవలసిన ప్రశ్న ఉన్నది. మనం నడిపింపబడే విధానం వాక్యాను సారమైనదా? మనం ధరించిన ఆత్మసంబంధమైన నామము బైబిలులో ఉన్నదా? మనం ఆ నామాన్ని ఈ లోకసంబధమైన చరిత్రలో కనుగొనవలసి యున్నదా? వినుటవలన విశ్వాసము కలుగకపోయిన యెడల (రోమా 10:17) మనము మానవకల్పితమైన ఆజ్ఞలయందే గాని యేసుక్రీస్తు ఆజ్ఞానుసారంగా నడచుటలేదు! సువార్త ప్రకటన ద్వారా సంఘము దేవుని మహిమ పరచినట్లు క్రొత్త నిబంధనయందు చదువగలము (1 తిమోతి 4 : 16). "వారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి" (అపొ. కా. 8 : 4). ఈ రోజుల్లో చాలామంది బోధకులు వారి ప్రసంగాలలో దేవుని వాక్యమునకు బదులు మానవతత్వ జ్ఞానమును ప్రకటించుచున్నారు. ఇట్టి బోధ దేవుని సంతోషపరచదు. మానవాళికి క్షేమాభివృద్ధి కలుగదు. యితరులకు మేలుచేయుటద్వారా ఆదిమ శతాబ్దమందు సంఘము యెహోవాను మహిమపరచెను. గలతీయులలో ఉన్న ప్రభువు సంఘములకు పౌలు ఇట్లు వ్రాసెను (గలతి 6:10) :

"కాబట్టి మనకు సమయము దొరికినకొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము".

సువార్త ప్రకటన, మేలుచేయుట ద్వారా అపొస్తలుల కాలములో సంఘము దేవుని మహిమపరచెను. క్రీస్తు ఆయన సంఘమును స్థాపించుటకు వేరొక ప్రయోజనము లేదు. సంఘమును సంఘముగా నుంచుటకు మంచి దృశ్యానికి మనము రావలసియున్నది.

విద్యావేత్తలు రాజకీయ నాయకులు పాఠశాలలు, ప్రభుత్వాలు నడిపించెదరు. పాపములో నశించిపోవుచున్న ఆత్మలను రక్షించుటయే క్రీస్తు సంఘముయొక్క కర్తవ్యము. మనము దేవుని సంకల్పాన్ని, సాటిలేని ప్రభువు సంఘాన్ని పరిశంసించి గౌరవించుటకు ఉపకరించుదము. (సమాప్తము) —జానీ రామ్సే.

---

## సంఘములో స్త్రీల పని

## ( The Work of Women in the Church )

సువార్తద్వారా క్రైస్తవ్యమును అంకురింపజేయుటలో పురుషులు స్త్రీలు కూడ ప్రాథమిక బాధ్యత వహించిరని అపొస్తలుల కార్యములు మొదటి అధ్యాయములను బట్టి తెలియుచున్నది. స్త్రీలు మొదటిగా సువార్తకు లోబడిన సందర్భములు గూడ గలవు. అపొ.కా. 16:13-15లో లూదియ ఆమె యింటివారు రక్షణ పొందుటను గూర్చి వ్రాయబడినది. యింటివారు అని పేర్కొనిన సందర్భమునుబట్టి ఆ గృహములో స్త్రీలు మాత్రమే యుండిరని గ్రహించుటకు అవకాశమున్నది. ఫిలిప్పీ సంఘములో ప్రభువు పని నిమిత్తము ప్రయాసపడిన స్త్రీలను గూర్చి పౌలు వ్రాయుచున్నాడు. సువార్త పనిలో నాతో కూడ ప్రయాసపడిన స్త్రీలకు సంపూర్ణ సహకారము లందించవలెనని వ్రాసినాడు (ఫిలిప్పీ 4:3). ప్రభువు పని నిమిత్తము నిజముగా ప్రయాసపడు స్త్రీల సామర్థ్యమును ఖచ్చితముగా కొలిచే సాధన మేమిలేదు. దైవభక్తి గల స్త్రీలకు నిత్యత్వములో మాత్రమే సరియైన ప్రతిఫలము లభింపగలదు.

ఏది స్త్రీల పనియో ఏది కాదో తెలుపుటకే ఈ వ్యాసము ఉద్దేశింపబడినది. సంఘములో స్త్రీలపని అనునది నేడు ఒక సమస్యగా

నున్నది. ఈ సమస్యను గూర్చి అనేక సంఘములలో వివాదములు గలవు. అనుకూలముగాను ప్రతికూలముగాను సిద్ధాంతపరముగాను ఆచరణ యోగ్యమైనదిగాను ఈ అంశమును గూర్చి చర్చించుట తెలివైన పని. దేవుడు తమకు నిర్దేశించిన పరిధిలో ఆత్మపూర్ణులుగా తమ కర్తవ్యమును నిర్వర్తించిన ఘనమైన స్త్రీలను గూర్చి నేర్చుకొనుటద్వారా ఈ వ్యాసమును ముగించగలము. ఈ వ్యాసమును చదువుటలో మీ ఎన్నిక మెచ్చుకొనదగినదని ఈ రచయిత అభిప్రాయము.

## స్త్రీలకు ప్రతికూలమగు పని — దాని పరిధి

స్త్రీల పని కొన్ని షరతులకు లోనై యుండుటలో ఆశ్చర్యమేమి లేదు. యెహోవా దేవుడు, ఆయన అద్వితీయ కుమారుడు ఆయన సేవకులు స్త్రీలకు కొన్ని షరతులు ఏర్పరచిరి. యోహాను 6:38లో యేసు యిట్లు చెప్పెను. "నా యిష్టమును నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకమునుండి దిగి వచ్చితిని". తనను తాను ఆనందపరచుకొనుట ప్రభువు చిత్తము కాదుగాని "నిన్ను నిందించువారి నిందలు నామీద పడెను" అని వ్రాయబడి యున్నట్లు ఆయనకు సంభవించెను (రోమా 15:3). దేవునికి తన్ను తాను లోపరచుకొని నందున ఆయన ద్వితీయ శ్రేణికి చెందిన రక్షకుడు లేదా విలువలేనివాడు అని అర్థము కాదు. పాత నిబంధనలోని హెబ్రీ ప్రవక్తలు, క్రొత్త నిబంధనలోని అపొస్తలులు ప్రవక్తలు సువార్తికులు మున్నగు వారందరు గూడ తండ్రియైన దేవుని చిత్తమునకు లోబడినవారే. అందు వలన వారు ద్వితీయ శ్రేణికి చెందిన సేవకులని గాని లేదా విలువలేని మనుష్యులని గాని తలంచరాదు. లోబడు విధాన క్రమమును గూర్చి అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాయుచున్నాడు. క్రీస్తు దేవునికి లోబడి

యున్నాడు. మానవుడు క్రీస్తుకు లోబడియున్నట్లుగా స్త్రీలు పురుషులకు లోబడి యుండవలెను (1 కొరింథి 11:3). లోబడుటవలన క్రీస్తు దైవత్వములో ద్వితీయ శ్రేణికి చెందిన వ్యక్తి కాలేదు. అట్లే మానవుడు క్రీస్తుకు లోబడుటద్వారా ద్వితీయ శ్రేణికి చెందుటలేదు. లోబడవలెనని ఆజ్ఞాపింపబడుటవలన స్త్రీలు కూడ తక్కువవారు లేదా ద్వితీయ శ్రేణికి చెందినవారు కాలేరు.

స్త్రీలు సంఘ పెద్దలుగా నుండరాదని లేఖనము ఖచ్చితముగా బోధించుచున్నది. పౌలు 1 తిమోతి 3:1లో అధ్యక్షుడగువాడు అని వ్రాయుచు పులింగమును వాడినాడు. అధ్యక్షుడగువాడు ఏకపత్నీ పురుషుడును తన పిల్లలను స్వాధీనపరచుకొనువాడై యుండాలి (1 తిమోతి 3:2, 4). పురుషులు మాత్రమే సంఘ సభ్యులుగా యుండవలెనని ఈ వాక్య భావము. అట్లే పరిచారకులుకూడ ఏకపత్నీ పురుషులుగా నుండవలెను (1 తిమో 3 : 12). స్త్రీలు పురుషుల పాత్ర నిర్వహింప వీలులేదు. స్త్రీ స్థానిక సంఘ సువార్తికునిగా నుండకూడదు. "స్త్రీ మౌనముగా ఉండవలసినదే గాని, ఉపదేశించుటకైనను, పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను" అని పౌలు వ్రాసెను (1 తిమో 2:12). సువార్తికుడైతే బోధించుట, హెచ్చరించుట, సంపూర్ణాధికారముతో దుర్బోధను ఖండించుట చేయవలెను (తీతు 2:15). గృహమునకు స్త్రీ యజమానిగా నుండరాదు. పౌలు దైవావేశము వలన గృహ యజమాని పురుషుడని మాత్రమే చెప్పెను. ఏదో ఆచారములను బట్టి స్త్రీలను గృహ యజమానులుగా చేయరాదు. పురుషులవలె యుండుటకు స్త్రీలు ప్రయత్నించుట స్త్రీ స్వభావమునకే విరుద్ధము. ఒకానొక సందర్భములో యొక తెలివైన స్త్రీ యిట్లు చెప్పెను: "కొన్ని పురుషులు చేయదగ్గ పనులు అట్లే కొన్ని స్త్రీలు చేయతగ్గ పనులు గనుక వీటిని ఋళితము చేయనవసంలేదు." ఈ తెలివైన స్త్రీ సుమారు 100 సం॥లు

జీవించి 1974 లో మరణించు వరకు తన భర్తతో కలసి 78 వివాహ సాంవత్సరికములను జరుపుకొనినది. దైవభక్తిగల స్త్రీలు తమకు నిర్ణయింపబడని స్థానముల కొరకు పనులకొరకు ఎదురుచూడరు.

## స్త్రీలు చేయదగిన పని

స్త్రీ యౌవన దశలోనే క్రీస్తునుగూర్చి విని క్రైస్తవ స్త్రీగా మారవచ్చును. క్రైస్తవ కృపలలో ఎదుగుచు తన జీవితమునుండి ఆత్మ ఫలములను ఫలింపజేయును (2 పేతురు 1:5-7; గలతి 5:22-23). క్రైస్తవ స్త్రీ వలె పవిత్రమైన జీవితమును గడపవలెను. ఒక మంచి వ్యక్తిని వివాహము చేసికొని సంపూర్ణమైన స్త్రీనిగాను తల్లిగాను తన పాత్ర నిర్వర్తింప వచ్చును. తన భర్తకు విశ్వాస పాత్రురాలుగాను సహకారిగాను ఉండవలెను (ఆది 2:18). తన భర్త మేలును కాంక్షించుచు తాను ప్రభువు వలననే ఉనికిని కలిగి యున్నానని గ్రహించు కొనవలెను (సామె 18 : 22; 19:14). ఆమె నేడు యోగ్యమైన అధునిక స్త్రీవలె నుండవలెను (సామె 31:10-31). ఆమె తన భర్తను, పిల్లలను ప్రేమించుచు వివేకముతో తన గృహ కృత్యములను జరిగించుకొనుచు కుటుంబములో రాణిగా నుండగలదు (తీతు 2:4-5). కాబట్టి యౌవన స్త్రీలు వివాహము చేసికొని పిల్లలను కని గృహ పరిపాలన జరిగించుచు, నిందించుటకు విరోధికి అవకాశమియ్యకుండ వలెనని కోరుచున్నాను (1 తిమో 5 : 14). పేతురు తన పత్రికలో పేర్కొనునట్టి స్వభావమును క్రైస్తవ స్త్రీ కలిగియుండవలెను (1 పేతురు 3:1-6). పురుషులతో బాటు స్త్రీలు కూడ పరలోక విషయములలో పాలివారమని యెరిగి మీ ప్రార్థనలకు అభ్యంతరము కలుగకుండ జాగ్రత్త పడుడి (1 పేతురు 3:7).

సాటి స్త్రీలకు ఆమె బోధింపవచ్చును (తీతు 2:3-5). ఆమె తన పిల్లలకు ఇతరుల పిల్లలకు కూడ బోధింపవచ్చును (2 తిమో

1:5; 3:14-15). ఆమె సత్ క్రియలు చేయవలెను (1 తిమో. 5:10). క్రీస్తుకొరకు తన భర్త చేయు పనిలో ఆమె పాలు పంచుకొనవలెను. పెద్దలు, పరిచారకులు, బోధకులు, బైబిలు ఉపదేశకులు ముత్యము కంటె అమూల్యమైన భార్యలతో ఆశీర్వదింపబడుదురు. స్త్రీలు సాటి స్త్రీలకు, పిల్లలకు సహాయకారిగా నుండుటకు కావలసిన బైబిలు జ్ఞానమును అందించుటకు సామర్థ్యముగల స్త్రీలకు తగిన ప్రోత్సాహము నేడు గలదు. క్రైస్తవ స్త్రీ తన గృహముయొద్ద పిల్లలకు బోధింపగలదు. క్రైస్తవ స్త్రీ తన పొరుగున గల అన్యుల పిల్లలను ఆదివారము, బుధవారము జరుగు బైబిలు తరగతులకు వేసవి బైబిలు పాఠశాలకును నడిపింపగలదు. రోగులను దర్శించుట, బలహీనముగా నున్నవారిని క్రొత్తగా వచ్చిన వారిని దర్శించి వారి మధ్య సమర్పణగల క్రైస్తవ స్త్రీలు పని చేయవచ్చును. యువతకు అవసరమగు విధానములను గూర్చి వారు యోగించిగలరు. ప్రభురాత్రి భోజనమును సిద్ధపరచుట, స్త్రీలు బాప్తిస్మము పొందు సమయములో సహాయము చేయుట మున్నగునవి వారు చేయవచ్చును. వీటన్నిటిని బట్టి నేడు క్రైస్తవ స్త్రీకి కావలసినంత పని లేదని ఎవరైనా చెప్పెదరా?

## స్త్రీలు ఎందుకు క్రీస్తుకొరకు పనిచేయాలి

క్రైస్తవ స్త్రీలు అంకిత భావముతో పనిచేయు స్త్రీలుగా నున్నారు. ఎక్కడైతే క్రైస్తవ్యమునకు బైబిలునకు చోటుగలదో అక్కడ స్త్రీలు ఘనులుగా ఎంచబడుదురు. ఎక్కడ క్రీస్తు గౌరవింపబడుటలేదో అక్కడ స్త్రీలు బలహీనమైన మానవులచే అణగద్రొక్కబడరు. క్రైస్తవ్యము స్త్రీలకు విలువను హోదాను కల్పించుచున్నది. క్రైస్తవ పరిచర్యలో స్త్రీలు శ్రద్ధ కలిగియుండుట ద్వారా తమ ఆత్మను గూర్చి కూడ జాగ్రత్త పడుదురు. యెహోవా కృపద్వారా రక్షింపబడినప్పటికి పరలోకపు చిత్తమునకు లోబడుటవలననే

ఆమె రక్షింపబడుచున్నదని చెప్పవచ్చును. తన ద్వారా ఎక్కువ పని జరుగు అవకాశమున్నది గనుక ఆమె క్రీస్తుపట్ల ఆసక్తిని కలిగి యుండవలెను. యేసుయెడల తనకు గల ప్రేమను ప్రత్యక్ష పరచుటకు చేయవలసి యున్నది. యోహాను యిట్లు వ్రాయు చున్నాడు : "మనము దేవుని ప్రేమించుచు ఆయన ఆజ్ఞలను నెరవేర్చువారమైతిమా దేవుని పిల్లలను ప్రేమించుచున్నామని దాని వలననే యెరుగుదుము" (1 యోహాను 5 : 3). ఈ అంశముల కంటె లోతైన భావములలో క్రీస్తును సేవించుటకు క్రైస్తవ స్త్రీలకు అవసరమా?

## క్రీస్తు కొరకు ఉత్సాహముగా పనిచేసిన స్త్రీలయొక్క మాదిరి

యోహాను 4వ అధ్యాయములో యాకోబు బావియొద్ద గల స్త్రీ పేరు వ్రాయబడనప్పటికి ఆమె క్రీస్తుతో ఒకేఒకసారి సంభాషించుటద్వారా ఆత్మీయ పరిపక్వత పొందినది. పిమ్మట తన తోటి సమరయుల నందరిని క్రీస్తునొద్దకు నడిపించుటలో ముందుకు వచ్చినది. మగ్దలేనే మరియలో నుండి ఏడు దయ్యములను యేసుక్రీస్తు వెళ్ళగొట్టిన తరువాత ఆమె తన శిష్యులలో యొక బలమైన శిష్యురాలువలె మారినది. సమాధినుండి లేచిన వెంటనే ఆయన మగ్దలేనే మరియకు కనిపించినాడు (మార్కు 16:9). మార్కు 14:3-9లో బేతనియకు చెందిన మరియ యేసును అత్తరుతో అభిషేకించుట ద్వారా నాడు కల్వరి సిలువలో అర్పింపబడిన ఆ గొప్ప నజరేయుడైన ప్రవక్తయొక్క ప్రశంస లందుకొన్నది. మార్కు సువార్త వ్రాసిన యోహాను మార్కు తల్లియైన మరియ కూడ తన గృహమును క్రైస్తవులు కూడి ఆరాధన చేసికొనుటకు తెరచినట్లుగా అపొ. కా. 12వ అధ్యాయంలో చదువగలము. ప్రిస్కిల్ల తన భర్త

మైన అకులతో ప్రయాణము చేయుచు అతనికి ప్రభువు పనిలో మిక్కిలి సహాయము చేసినది. ఆమెనుగూర్చి తన భర్తను గూర్చి గ్రంథములో ఏకముగా పేర్కొనబడినది. ప్రతి క్రైస్తవ భార్య భర్తలు ఐక్యముగా కలసి పనిచేయుటకు వారు హెచ్చరికగాను మాదిరిగాను యున్నారు. లూయి, యునీకె అను స్త్రీలనుగూర్చి ఒక్కసారే పేర్కొనబడెను. తిమోతిని ఏ సంకల్పము కొరకు నిజమైన విశ్వాస శ్రద్ధలతో సిద్ధపరచితిరో ఆ ఫలితములను అతడు తన జీవితములో కనుపరచెను. రోమా 16:1-2 లో ఒకే పర్యాయము ఫీబేను గూర్చి వ్రాయబడినది. ఆమెను గూర్చి సహోదరి, సంఘ పరిచారకురాలు, పరిశుద్ధురాలు, అనేకులకు సహాయకురాలని పేర్కొనబడినది. నేటి క్రైస్తవ స్త్రీలకొరకు ఎంతటి గొప్పపని యున్నదో గమనించుము. పౌలు సువార్త విషయములో తనకు సహకారులుగ నున్న స్త్రీలను మెచ్చుకొనుచున్నాడు (ఫిలిప్పీ 4:3). ప్రభువునందు ఏర్పరచబడిన రూఫునకు వందనములు; అతని తల్లికి వందనములు; ఆమె నాకును తల్లి (రోమా 16 : 13) అని పౌలు పేర్కొనెను. వీటన్నిటిలోను మార్కు 10:30 యొక్క నెరవేర్పును చూడగలము.

క్రైస్తవ స్త్రీల ఘనత, వివేకము, విజయము కొరకు యెహోవా ఎంతటి ఆశ్చర్యకరమైన రూపమును ఏర్పాటు చేసెను! ప్రేమగల, మృదువైన, దయగల క్రైస్తవ స్త్రీలను బట్టి దేవునికి వందనములు.

—రోబర్ట్ ఆర్. టైలర్.

---

# పిల్లలనుగూర్చి తండ్రియొక్క బాధ్యత

"అందుకు మనోహ - నా ప్రభువా పుట్టబోవు ఆ బిడ్డకు మేమేమి చేయవలెనో దానిని మాకు నేర్పునట్లు దయచేయుమని యెహోవాను

వేడుకొనెను" (న్యాయా 13:8). మనోహ చేసిన ప్రార్థనవంటి ప్రార్థనను ప్రతి తండ్రి తన బిడ్డలను పెంచుటలో దేవుని ప్రార్థించాలి. "తండ్రులే కుమారులకు అలంకారము" (సామెతలు 17 : 6). తండ్రి అనే పదములో, కాపాడుట, పోషించుట అనునవి ఇమిడి యున్నవి. ఈ పదము చాలా ఆనందకరమైనది. దేవుని ప్రేమించే తండ్రిని నీవు కలిగియుంటే అతడు నిన్ను కాపాడును, పోషించును నీకు మాదిరిగా ఉండి నిన్ను మంచి మార్గములో నడిపించును.

"తండ్రులారా మీ పిల్లలకు కోపము రేపక ప్రభువుయొక్క శిక్షలోను, బోధలోను వారిని పెంచుడి" (ఎఫెసీ 6:4). "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము, వాడు వృద్ధుడైనప్పుడు దాని నుండి తొలగిపోడు" (సామె 22:6). "...కుమారుని ప్రేమించువాడు బాల్యమునందే వానిని శిక్షించును" (సామె 13:24). పై వచనములలో తండ్రి పిల్లలను దేవుని భయభక్తులలో పెంచుటలో ఎట్టి బాధ్యత కలిగియున్నాడో మనము చూడగలము.

"మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు" (మత్తయి 5:48). "కావున మీరు ప్రియులైన పిల్లలవలె దేవుని పోలి నడుచుకొనుడి" (ఎఫెసి 5:1). తండ్రిగా ఉండు నట్లు దేవుడు నిన్ను చేసి - నీ బిడ్డలను దేవుని పోలి నడుచుకొనువారినిగా నీవు సిద్ధపరచాలని దేవుడు కోరుచూ ఈ బాధ్యతను నీపై పెట్టియున్నాడు.

బైబిలునుండి తమ పిల్లల విషయమై జాగ్రత్త తీసికొనిన కొందరి తండ్రులను గూర్చి ఆలోచింతము.

**1. యెరెదు :** "యెరెదు నూట అరువది రెండేండ్లు బ్రతికి హనోకును కనెను" (ఆది.కాం. 5 : 18). "హనోకు దేవునితో నడిచిన

తరువాత దేవుడతనిని తీసికొని పోయెను..." (ఆది.కాం. 5:24). యెరెదు తన కుమారుని దేవునితో నడచువానిగా చేయగలిగెను. దేవుని దయలో మన బిడ్డలు నడచుకొన్నప్పుడే తండ్రికి ఆనందం కలుగును.

2. నోవహు : "నోవహు నీతిపరుడును, నిందారహితుడై యుండెను. నోవహు దేవునితో నడచినవాడు" (ఆ.కాం. 6:9). నోవహు నీతిని ప్రకటించి తనను, తన కుమారులను, కోడండ్రను తన భార్యను జలప్రళయమునుండి రక్షించుకొనెను (2 పేతు 2:5).

3. యోబు : "యోబు తన కుమారులు పాపము చేసి తమ హృదయములలో దేవుని దూషించిరేమో యని వారిని పిలువనంపించి వారిని పవిత్రపరచి అరుణోదయముననే లేచి వారిలో ఒక్కొక్కని నిమిత్తమై దహన బలులు అర్పించుచూ వచ్చెను" (యోబు 1 : 5). యోబు వలె ప్రతి తండ్రి అనుదినము తన బిడ్డల విషయమై ప్రార్థించవలెను.

4. అబ్రాహాము : "యెహోవా అబ్రాహామును గూర్చి చెప్పినది అతనికి కలుగజేయునట్లు తన తరువాత తన పిల్లలును, తన యింటివారును నీతి న్యాయములు జరిగించుచూ...నే నీతిని యెరిగి యున్నాననెను" (ఆ.కాం. 18:19). అబ్రాహాము ఆ రీతిగా చేసినందున యూదులకు, విశ్వాసులకు తండ్రి ఆయెను. అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకును బలిగా అర్పించి తిరిగి పొందగలిగెను.

5. యాకోబు : "ఏశావు కన్నులెత్తి ఆ స్త్రీలను, పిల్లలను చూచి వీరు నీకేమి కావలెనని అడిగినందుకు - వీరు దేవుడు నీ సేవకునికి దయచేసిన పిల్లలే అని చెప్పెను" (ఆ.కాం. 33:15). ప్రతి తండ్రి ఈ సత్యమును గ్రహించవలెను. దేవుడు తనకు ఇచ్చిన పిల్ల

లను యాకోబు దేవుని భయములో పెంచెను. వారందరు ఇశ్రాయేలీయులకు గోత్ర కర్తలుగాను గొప్ప దేవుని జనాంగముగాను ఆశీర్వదింప బడిరి. ఇశ్రాయేలు జనము దేవుని జ్యేష్ఠ కుమారుడని దేవుడు చెప్పెను.

6. "యెష్షయి: "యెష్షయి కుమారుడగు దావీదును గూర్చి దేవుడు చెప్పినది ఏమనగా అతడు నా యిష్టానుసారుడైన మనుష్యుడు" (1 సమూ 13 : 14; అపొ.కా. 13:22). మన పిల్లలను గూర్చి దేవుని సాక్ష్య మెట్టిది?

7. యోనా : "అందుకు యేసు - సీమోను బర్‌యోనా (యోనా కుమారుడవైన సీమోనూ) నీవు ధన్యుడను" (మత్తయి 16 : 17) యోనా కుమారులు సీమోను, అంద్రెయ (మత్తయి 4:18-20). ఈ ఇద్దరిని ప్రభువుకు శిష్యులుగా అప్పగించెను.

8. జెబెదయి : తన కుమారులగు యాకోబు, యోహాను లను క్రీస్తు శిష్యులుగా సమర్పించెను (మత్తయి 4 : 21, 22).

యోసేపు, మరియల కుమారు డనిపించుకొన్న యేసు క్రీస్తు మానవాళి కందరికి మార్గదర్శిగా జీవించినాడు. యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయ యందును మానవుల దయ యందును వర్ధిల్లుచుండెను. అందుకే "ఈయన నా ప్రియ కుమారుడు ఈయన యందు నేనానందించు చున్నాను" (మత్త 3 : 17) అని క్రీస్తును గూర్చి దేవుడు పలికాడు. (సశేషం)

—పి. ప్రకాశం, హైదరాబాదు.

# అలంకారము

## ( Adornment )

మానవుల యెడల దేవుని చిత్తమేమై యున్నదో లేఖనాలు విశదీకరిస్తున్నాయి. దేవుడు తన చిత్తాన్ని మానవులకు బయలు పరచడానికి మానవులనే ఎన్నుకొని వారు పరిశుద్ధాత్మ ప్రేరణచేత అందరికీ అర్ధమయ్యే రీతిలో సామాన్య భాషలో వ్రాయునట్లు నిర్ణయించాడు. బైబిలు గ్రంథ మందలి విషయాలు మానవులు అర్ధంచేసికొనలేని భాషలో వ్రాయబడలేదు. తన చిత్తాన్ని అందరూ గ్రహించాలని ఆయన కోరుచున్నాడు. అయితే బైబిలు నందు కొన్నిసార్లు అలంకార భాష ఉపయోగించబడినది. ఈ అలంకార భాష అర్ధరహితంగాను రహస్యంగాను మాత్రము లేదు. ఉదాహరణకు: ప్రకటన గ్రంథములో అలంకారభాష (Figurative Language) ఎక్కువగా ఉపయోగింపబడినది.

"ఏడు నక్షత్రములు తన కుడిచేత పట్టుకొని యేడు దీపస్తంభముల మధ్య సంచరించువాడు చెప్పు సంగతులేవనగా"...అలంకార భాషలో వ్రాయబడిన ఈ మాటను చదివిన వెంటనే ఆయన యేసుక్రీస్తే యని సులభంగా అర్ధం చేసికొంటున్నాము.

నేడు క్రైస్తవలోకంలో ఉన్న విభజనలకు ఒకే ఒక మూల కారణమున్నది. వాక్యాన్ని అపార్ధం చేసికోవడం వలననే బైబిలు బోధించే ఏకత్వాన్ని సాధించలేకపోవడం జరుగుచున్నది. బాప్తిస్మము రక్షణకొరకు అని బైబిలు బోధిస్తుంటే (మార్కు 16:16 ; 1 పేతు 3:21), బాప్తిస్మ మనగా నీటి బాప్తిస్మము కాదు, దీన్ని అక్షరార్ధంగా తీసుకొనకూడదు అని బోధించేవారున్నారు. వివాహము ఘనమైనదని హెబ్రీ 13 : 4లో బైబిలు బోధిస్తుంటే అది అలంకార భాష యని వివాహము ఘనమైనది కాదు, వివాహము అంటే అక్షరార్ధమైన

వివాహము కాదు అని చెప్పేవారున్నారు. ప్రకటన గ్రంథం 20వ అధ్యాయం దగ్గరకు వచ్చేసరికి "క్రీస్తుతో కూడ వెయ్యి సంవత్సరములు రాజ్యము చేయుదురు" (ప్రక 20:6) అనే వాక్యం అక్షరార్థమైనదని భావించి "వెయ్యేండ్ల పాలన" అను అబద్ధ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. అలంకార భాషలో వ్రాయబడిన సంగతులు అక్షరార్థంగాను, అక్షరార్థమైనవి అలంకార భాషలోను బోధించే వీరి బోధలకు లక్షలాది ప్రజలు తమ ఆమోదాన్ని తెలియజేస్తున్నారు. "ఘట సర్పము" "మిడతలు" మొదలగునవి అలంకార భాషలో వ్రాయబడినవనే విషయం తెలియని వీరు "మిడతలు" అంటే మిడతలే వచ్చి ప్రజలపై దాడిచేస్తాయని అక్షరార్థంగా బోధించే బోధలు సత్యాన్వేషులకు ఆశ్చర్యాన్ని కలుగజేస్తాయి. ఈ సంగతులు ఆయా రాజ్యాలను, రాజులను, వాటి అధికారాన్ని సూచిస్తున్నాయి.

అలంకారభాషకు, అక్షరార్థమైన భావన (Literal Sense)లో వ్రాయబడిన విషయాలకు మధ్య వ్యత్యాసాన్ని మీ కళ్ళముందుంచే ప్రయత్నంలో యిన్ని విషయాలు ఉపోద్ఘాతంగా చెప్పవలసి వచ్చింది.

మేము మీకు బోధించే అంశము 'అలంకారము'. అలంకారము అంటే ఏమిటి? 1 తిమోతి 2:9-10లోను, 1 పేతురు 3:3-5లో పౌలు, పేతురు చెప్పిన అలంకార మేమిటి? చాలామంది స్త్రీలకు ఈ విషయంలో సందేహాలున్నాయి. ఆ సందేహాలను దేవుని వాక్యపు వెలుగులో నివృత్తి చేయడమే 'సత్యవాక్కు' పత్రిక యొక్క ముఖ్యోద్దేశము.

ఈ వచన భాగాన్ని ఒకసారి చదువుదాం: 1 తిమోతి 2:9-10.

"మరియు స్త్రీలు అణకువయు, స్వస్థబుద్ధియు గలవారై యుండి, తగు మాత్రపు వస్త్రములచేతనే గాని జడలతోనైనను బంగారముతోనైనను ముత్యములతోనైనను మిగుల వెలగల వస్త్రములతోనైనను

అలంకరించుకొనక, దైవభక్తి గలవారమని చెప్పుకొను స్త్రీలకు తగిన ట్టుగా సత్ క్రియలచేత తమ్మునుతాము అలంకరించుకొనవలెను"

"జడలు అల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయు నను వెలుపటి అలంకారము మీకు అలంకారముగా ఉండక, సాధువైనట్టియు మృదువైనట్టియునైన గుణమును అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను" (1 పేతురు 3:3-4.)

సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమే స్త్రీలకు శాశ్వతమైన అలంకారమని ఈ వాక్య భాగాల సారాంశము. స్త్రీలు బంగారు నగలు ధరించడాన్ని ఈ వచన భాగాలు ఖండించుటలేదు. ఈ విషయం వాక్యం ద్వారా ఋజువు చేయాలని ఆశిస్తున్నాం. ముందుగా పై అలంకారమని చెప్పబడిన మూడు విషయాలు.

1. జడలు అల్లుకొనుట
2. ఆభరణములు ధరించుకొనుట
3. వస్త్రములు ధరించుకొనుట

కొందరు మతశాఖలవారు రెండవ విషయానికే ప్రాముఖ్యమిచ్చి మిగిలిన రెండు విషయాలలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

"క్షయమైన ఆహారముకొరకు కష్టపడకుడి గాని నిత్యజీవము కలుగజేయు అక్షయమైన ఆహారము కొరకే కష్టపడుడి". అని యోహా 6:27 లో యేసు బోధించిన మాటను బట్టి మనం ఆహారం తినకూడ దని దాని కొరకు కష్టపడకూడదని యేసు బోధించెనా? క్షయమైన శరీరాహారం కంటె ఆత్మ సంబంధమైన ఆహారం ముఖ్యమని దీనిభావం గాని, ఆహారం తినవద్దని కాదుకదా! హృదయపు అంతరంగ స్వభావం మీకు నిజమైన అలంకారమని, పై అలంకారం కంటె హృదయాలం కారం ముఖ్యం అని దీని భావం.

విపరీతమైన అలంకారం చేసికోమని మేము బోధించడం లేదు. "విపరీతమైనదేదీ మంచిది కాదని" ఆంగ్ల భాషలో సామెత ఉన్నది. విగ్రహారాధనతో ప్రమేయం లేని, నీ విశ్వాసానికి ఆటంకం కలిగించని, నీ సహోదరులకు అభ్యంతరంలేని అలంకారం ఖండించబడలేదు.

"నిద్రలేక మెలకువగా ఉండి..." 1 థెస్స 5:6 అను వాక్యం చదివి నిద్రపోకూడదని బోధిస్తే వాక్యం అపార్థం చేసికోవడమే అవుతుంది.

ముఖ్యంగా స్త్రీలకు అణుకువ, స్వస్థబుద్ధి నిజమైన అలంకారం. ఆ అలంకారం ఆమెకు నిజమైన అందాన్ని చేకూరుస్తుంది.

—ఇ. కె. వి. ప్రసాదరావు, చెయ్యేరు.

---

Regd. No. H/KD—45/KJ.R.O.

*From*
**SATYA WAKKU**
**P.O. Box. 80**
**KAKINADA-533 001**

**No.**

**To**

.......................................

.......................................

.......................................

.......................................